క్లుప్తంగా

నేత్రపర్వంగా ఆదిదేవుడి గిన్నెభిక్ష



పురవీధుల్లో ఊరేగుతున్న ఆదిదేవుడు

పొదలకూరు : పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదిదేవుని గిన్నెభిక్ష మహోత్సవం ఆదివారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. పురవీధుల్లో అర్చకులు గిన్నెభిక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు కాయ, కర్పూరం సమర్పించారు. పొదలకూరు మండల బ్రాహ్మణ సేవాసంఘం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ నాయకులు పీబీఎస్ ప్రసాద్‌స్వామి, ఎం.రాజశేఖర్, గోపాలకృష్ణమాచార్యులు, కృష్ణమూర్తి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక రోగికి తీవ్రగాయాలు



రక్తగాయాలతో ఉన్న గుర్తుతెలియని వ్యక్తి

మనుబోలు : మానసిక రోగి తన తలను రోడ్డుకేసి బాదుకోవడంతో తీవ్ర గాయాలైన ఘటన మనుబోలు పరిధిలోని జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తి హైవేపైకి చేరుకుని రోడ్డుకు బాదుకుంటూ రక్తగాయాలై పడిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతన్ని చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తిపై కత్తితో దాడి

వెంకటాచలం : ఓ దుకాణం వద్ద తలెత్తిన వివాదం కారణంగా మండలంలోని కాకుటూరు గ్రామానికి చెందిన మహేష్‌ను అదే గ్రామానికి చెందిన పచ్చబట్ల సాయి కత్తితో దాడి చేసిన ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. మహేష్, పచ్చబట్ల సాయి గొలగమూడి వద్ద ఓ దుకాణం వద్దకు స్నేహితులతో కలిసి వెళ్లారు. అక్కడ జరిగిన చిన్న వివాదం కారణంగా ఇద్దరూ కాకుటూరు గ్రామానికి వచ్చారు. ఈ విషయంపై కాకుటూరులో ఇద్దరూ మరోసారి గొడవపడి మహేష్‌ను సాయి కత్తితో దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడిన మహేష్‌ను కుటుంబసభ్యులు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అభివాదం చేస్తున్న స్వేరోస్ ప్రతినిధులు

నెల్లూరు(వేదాయపాళెం): మహనీయుల త్యాగాల స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని స్వేరోస్ మహిళా విభాగం రాష్ట్రాధ్యక్షురాలు మందల పద్మజ అన్నారు. దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో స్వేరోస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహనీయుల త్యాగాల స్ఫూర్తి సభను ఆదివారం నిర్వహించారు. తొలుత సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్, రమాబాయి అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మందల పద్మజ మాట్లాడుతూ అక్షరం, ఆరోగ్యం, ఆర్థిక విభాగాల్లో ప్రజలు సాధికారత సాధించడం ద్వారా జ్ఞాన సమాజాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా విశ్రాంత ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వేరోస్ పనిచేస్తోందన్నారు. అందులో భాగంగా మహనీయుల త్యాగాల స్ఫూర్తి సభలను ప్రతి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. సావిత్రిబాయి పూలే చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గూడూరు సీతామహాలక్ష్మి, పద్మావతి వర్సిటీ ప్రొఫెసర్ తవిత, రాధ, విజయకుమార్, చిట్టెయ్య, సురేంద్ర, బాలకృష్ణ, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బైక్ అద్దాల ధ్వంసంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తిపై దాడికి యత్నించడంతో పాటు బైక్ అద్దాలను ధ్వంసం చేసిన ఘటనపై సంతపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాలు..కపాడిపాళేనికి చెందిన ఎం శాంతిస్వరూప్ కలెక్టర్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఈ నెల 15న రాత్రి కార్యాలయం నుంచి బైక్‌పై ఇంటికి బయల్దేరారు. కపాడిపాళెం ఆర్చి రోడ్ వద్దకు వచ్చేసరికి అదే ప్రాంతానికి చెందిన హనోక్ మద్యం మత్తులో అడ్డగించి గొడవకు దిగాడు. బైక్ అద్దాలు పగులగొట్టాడు. అనంతరం కత్తితో దాడికి యత్నిస్తుండగా శాంతిస్వరూప్ పెద్దగా కేకలు వేశాడు. స్థానికులు రావడాన్ని గమనించి నిందితుడు పరారయ్యాడు. ఆదివారం బాధితుడు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

పచ్చదనం పరిఢవిల్లే

పుష్కలంగా లభించే సాగునీరు.. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం వెరసి ప్రతిపల్లె సాగుసిరులతో కళకళలాడుతున్నాయి. గతంలో బీడు భూములు, ఎండిన చెరువులతో దర్శనమిచ్చే ఈ ప్రాంతంలో ప్రస్తుతం పచ్చదనంతో పరిఢవిల్లుతున్నాయి.

- 14 వేల ఎకరాల్లో వరిసాగు
- 1,250 ఎకరాల్లో పత్తి
- ప్రతి సెంట్‌కు సాగునీరు



మండలంలో సాగవుతున్న వరిపంట

పొదలకూరు : సకాలంలో కురిసిన వర్షాలు, పైతట్టు ప్రాంతాల్లో వరదల వల్ల జిల్లాలోని సోమశిల, కండలేరు ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. దీంతో ఒక్క సెంట్ భూమి కూడా ఖాళీ లేకుండా పొదలకూరు మండలంలో సుమారు 14 వేల ఎకరాల్లో రైతులు వరినాట్లు వేశారు. దీంతో గ్రామాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. జలవనరులు, వ్యవసాయ, తెలుగుగంగ శాఖల అధికారులను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమన్వయపరచి రైతులకు సంబంధం లేకుండా సాగునీటిని అందిస్తున్నారు. ఫలితంగా ఎక్కడా సాగునీటి వివాదాలు తలెత్తడం లేదు.

రైతుల పంట మార్పిడి

వర్షాలు అధికంగా కురవడం వల్ల ఈ ప్రాంతంలో కొన్ని నేలలు వరిసాగుకు అనుకూలించ లేదు. ఫలితంగా వావింటపర్తి, మహ్మదాపురం, పీజీపట్నం, బిరదవోలు, ఇనుకుర్తి, డేగపూడి, మొగళ్లూరు, చెన్నారెడ్డిపల్లి, వరదాపురం, తాటిపర్తి, పార్లపల్లి, బిదరవోలు తదితర గ్రామాల్లో రైతులు 1,250 ఎకరాల్లో పత్తిసాగు చేపట్టారు. దీంతో రైతులు పంట మార్పిడికి అలవాటు పడుతున్నట్లుగా వ్యవసాయాధికారులు వెల్లడించారు. పత్తి పంట క్వింటాళ్లకు రూ.10 వేల ధర పలకడం కూడా రైతులకు కలిసి వచ్చే అంశంగా వెల్లడిస్తున్నారు.

కాలువల ద్వారా సాగునీరు

మండలంలో సోమశిల దక్షిణ కాలువ, కనుపూరు, నెల్లూరు కాలువలు, కండలేరు ఎడమగట్టు కాలువ, ఒకటో నంబర్ బ్రాంచి కాలువల ద్వారా సాగునీరు అందుతోంది. ఫలితంగా ఎక్కడా పొలం ఖాళీ లేకుండా రైతులు నాట్లు వేసుకున్నారు. 2015 తర్వాత మండలంలో సరైన వర్షపాతం నమోదు కాలేదు. 2019 నుంచి వరుసగా పంటలు పండుతున్నాయి. సర్వేపల్లి నియోజకవర్గంలో పెద్ద మండలమైన పొదలకూరులో వరిపంటల సాగుకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సాగునీటిని విడుదల చేస్తున్నారు.



ఎడమగట్టు కాలువ ద్వారా అందుతున్న సాగునీరు

సాగునీటి సమస్యలు లేవు



పంటల సాగులో సాగునీటి సమస్యలు లేవు. వరుసగా నాలుగో ఏడాది రబీ పంటలు బాగా పండే అవకాశం ఉంది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధికారులు, రైతులను సమన్వయ పరచి ఎక్కడా సమస్యలు లేకుండా పర్యవేక్షిస్తున్నారు.

– కె.రామిరెడ్డి, రైతు, కొనగలూరు

పుష్కలంగా నీటి నిల్వలు

ఎక్కడా సాగునీటి ఇబ్బందులు లేవు. ఎడమగట్టు కాలువ ద్వారా చెరువులకు సాగునీటిని ఇస్తున్నాం. చెరువుల్లో పుష్కలంగా నీటి నిల్వలు ఉన్నాయి. రైతులు ఎవరూ సాగునీరు కావాలని అడగడం లేదు.

– జానకిరామిరెడ్డి, ఇరిగేషన్ ఏఈ, పొదలకూరు

ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే చర్యలు

- కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి



ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం : దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లలో సరుకులను అమ్మితే చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని మాంసం, చేపల మార్కెట్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు మాంసం, చేపల విక్రయదారులు కొనుగోలుదారులకు ప్లాస్టిక్ కవర్లలో వేసి ఇవ్వడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. మరోసారి ఇలా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు కూడా ఇంటి వద్ద నుంచే సంచులను తెచ్చుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వాడటం వల్ల ప్రాణాంతక రోగాలు వస్తాయని తెలిపారు.

నేడు స్రిడ్స్‌లో 'మా నమ్మకం నువ్వే జగన్'

- హాజరుకానున్న మంత్రి కాకాణి

వెంకటాచలం : మండలంలోని చెముడుగుంట వద్ద ఉన్న స్రిడ్స్ కల్యాణ మండపంలో సోమవారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

ప్రశాంతంగా ఎస్సై ప్రిలిమినరీ పరీక్ష



వీఎస్‌యూలో అభ్యర్థుల హడావుడి

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమసింహపురి యూనివర్సిటీ, వెంకటాచలంలోని క్యూబా ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎస్సై ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెట్లుగా పరీక్షలు జరిగాయి. విక్రమసింహపురి యూనివర్సిటీలో 350 మంది అభ్యర్థులకు గాను, 286 మంది హాజరు కాగా 64 మంది గైర్హాజరయ్యారు. క్యూబా ఇంజినీరింగ్ కళాశాలలో 300 మంది అభ్యర్థులకు గాను, 266 మంది హాజరు కాగా 34 మంది గైర్హాజరయ్యారు.

సాగరతీరం జనసంద్రం




కృష్ణపట్నం వద్ద సముద్ర స్నానాలు చేస్తున్న భక్తులు

ముత్తుకూరు : మహా శివరాత్రి సందర్భంగా జాగరణ చేసిన భక్తులు ఆదివారం కృష్ణపట్నం గ్రామ తీరంలో భక్తిశ్రద్ధలతో సముద్ర స్నానాలు ఆచరించారు. దీంతో సాగరతీరం జనసంద్రమైంది. మండల నలుమూలల నుంచే కాకుండా నెల్లూరు పట్టణం నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావడంతో తీరం కిక్కిరిసిపోయింది. సముద్రానికి వెళ్లే మార్గంలో వాహనాల రద్దీ వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శనివారం రాత్రి సిద్దేశ్వరాలయంలో మహాశివుడి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాన్ని తిలకించిన అనంతరం భక్తులు వేకువజాము నుంచే సముద్ర స్నానాలకు క్యూ కట్టారు. ఉదయం 11 గంటల వరకు భక్తుల రాకపోకలు తగ్గలేదు.

నంది వాహనంపై రామలింగేశ్వరుడు

- వేడుకగా గ్రామోత్సవం



నందివాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

పొదలకూరు : మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పొదలకూరులోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవారు శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు నంది వాహనంపై ఊరేగారు. పొదలకూరు రైతు సంఘం ఉభయకర్తలుగా వ్యహరించి గ్రామోత్సవాన్ని కనుల పండుగా జరిపించారు. ఉత్సవం వెంట బాణసంచా, తప్పెట్లు తాళాలతో పట్టణం మారుమోగింది.

నేడు స్వామి, అమ్మవార్ల కల్యాణం

కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా జరుగుతుందని ప్రధానార్చకుడు ప్రసాద్‌స్వామి తెలిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం గ్రామోత్సవం జరుగుతుందని, ఉభయకర్తలుగా ఆర్యవైశ్య సంఘం వ్యవహరిస్తుందన్నారు.

చంద్రప్రభ వాహనంపై వెంకటేశ్వరస్వామి



చంద్రప్రభ వాహనంపై కొలువుదీరిన స్వామివారు



కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్లు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని రామకృష్ణానగర్‌లో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు ఆదివారం రాత్రి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి సుదర్శన నారసింహాయాగం, పూర్ణాహుతి, మంగళశాసనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని చంద్రప్రభ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవానికి తరలించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా తుమ్మల పెంచలరెడ్డి–రమణమ్మ, తోట శ్రీనివాసులురెడ్డి–సరిత వ్యవహరించారు.

ఇస్కపాళెంలో..

మండలంలోని ఇస్కపాళెంలో కొలువైన మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ, ఈశ్వరీదేవి మఠంలో ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ఆదివారం కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. ఈ కార్యక్రమానికి కోడూరు సుధాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం కుమారులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ప్రసన్నకృష్ణారెడ్డి వ్యవహరించారు. అర్చకుడు ఆదిశేషయ్య పాల్గొన్నారు.

వైభవంగా ఆరాధన మహోత్సవం



పొదలకూరు : పొదలకూరు సమీపంలోని చిట్టేపల్లితిప్పలో ఉన్న దేవగిరి క్షేత్రంలో వెంకయ్యస్వామి ప్రథమ శిష్యుడు నారాయణస్వామి 15వ ఆరాధన మహోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఉదయం 9 గంటల నుంచి నిత్యపూజ, విఘ్నేశ్వర పూజ, నవగ్రహారాధన, లక్ష్మీగణపతి హోమం, ఓం నారాయణ ఆదినారాయణ హోమం, పూర్ణాహుతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. మహిళలు అధిక సంఖ్యలో వచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాల్లో నిర్వాహకులు గుండ్రా జనార్ధన్‌రెడ్డి దంపతులు, తరుగు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరునికి పల్లకిసేవ



శివపార్వతులను పల్లకిలో మోసుకొస్తున్న భక్తులు

మనుబోలు : మండలంలోని బద్దెవోలు రోడ్డులో కండలేరు ఒడ్డున కొలువైన కామాక్షితాయి సమేత సంగమేశ్వరస్వామికి పల్లకి సేవను శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం అనంతరం శివపార్వతులను పూలతో అలంకరించిన పల్లకిలో ఉంచి మంగళ వాయిద్యాల నడుమ సంగమేశ్వరాలయం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలోని మనుబోలుకు తీసుకొచ్చారు. అనంతరం శివాలయంలో అర్చకులు ఫణీంద్రశర్మ, సాయిశర్మ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం



మనుబోలు : శివపార్వతుల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు



కొడవలూరు : స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం

ఇందుకూరుపేట : మైపాడులో కొలువైన కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరుని కల్యాణోత్సవం ఆదివారం కమనీయంగా సాగింది. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను పుష్పాలతో అలంకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చారు. నెల్లూరుకు చెందిన దంపూరు వినయ్‌కుమార్‌శర్మ, సందీప్ శర్మ ఆధ్వర్యంలో మేళతాళాల నడుమ శాస్త్రోక్తంగా వేడుకను జరిపారు. ఉభయకర్తలుగా నెల్లూరుకు చెందిన నెల్లూరు సుజనమ్మ, కుమారులు వెంకట రమణారెడ్డి, శ్రీకర్‌రెడ్డి వ్యవహరించారు. కాగా స్వామి, అమ్మవార్లకు నిర్వహించిన పూలంగిసేవ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అన్నప్రసాద వితరణకు నెల్లూరుకు చెందిన గొడేపల్లి శేషయ్య, భువనగిరి సుబ్బయ్యస్వామి, జీవీ సుబ్రహ్మణ్యం శర్మ వ్యవహరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గంపల కృష్ణయ్య, రామసుబ్బయ్య, నాగరాజుపల్లి శ్రీనివాసులు, కొండూరు త్రిమూర్తి పాల్గొన్నారు.

విశ్వనాథస్వామి సన్నిధిలో..

మనుబోలు : మనుబోలులోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆలయ ఆవరణలో ఉన్న విశ్వనాథస్వామి సన్నిధిలో శివపార్వతుల కల్యాణాన్ని శనివారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. మొక్కజొన్న కంకులు, యాపిల్, ద్రాక్ష వంటి వివిధ రకాల పండ్లు, పుష్పాలతో కల్యాణ మండపాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. అనంతరం అర్చకులు శ్రీనివాసులు శివపార్వతులకు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. గుండుబోయిన వెంకటేశ్వర్లు, అక్కుబోయిన సురేష్ కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఉదయకేశ్వర స్వామి ఆలయంలో..

కొడవలూరు : గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్ల కల్యాణం ఆదివారం రాత్రి కమనీయంగా సాగింది. ఆర్యవైశ్య సంఘం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణానికి హాజరై కానుకలు సమర్పించారు. కల్యాణ వ్యాఖ్యాతగా బండారు తులసి మల్లికార్జునశర్మ వ్యవహరించారు. ఆలయ అర్చకులు బండారు సుబ్రమణ్యం, సర్వబొట్ల హరిప్రసాద్‌లు కల్యాణ తంతు జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఆలయ ఈఓ బండి శాంతయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, పెనాక శ్రీనివాసులురెడ్డి, బెల్లం వెంకటనగేష్ నాయుడు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి, అమ్మవార్లకు రథోత్సవం జరుగుతుందని ఆలయ ఈఓ తెలిపారు. రాత్రి తెప్పోత్సవం వేడుకగా జరుగుతుందని పేర్కొన్నారు.

నేత్రపర్వంగా..

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న లక్ష్మీ గోదాదేవి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీనివాసుని కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. మహిళా భక్తులు విశేషంగా పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన నిర్మాణ బాధ్యులు వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం.శ్యామ్‌ప్రసాద్, కొమ్మి వేణుగోపాల్, దాసరి శ్రీనివాసులు, సన్నికంటి మురళీ, చొప్పా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: పుష్పాలంకరణలో కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరస్వామి



పొదలకూరు : ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు